28న వైవీయూలో సైన్స్ డే

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా సైన్స్ దినోత్సవం ఉండాలని వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని డీన్‌లు, అన్ని శాఖల విభాగాధిపతులతో సైన్స్ దినోత్సవ నిర్వహణపై విసి ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఈనెల 28న సైన్స్ డే నిర్వహణపై అభిప్రాయాలను స్వీకరించారు. దేశంలో ప్రఖ్యాతిగాంచిన సైన్స్ పరిశోధకులను ఆహ్వానించి సైంటిఫిక్ లెక్చర్ పై ప్రసంగం ఇవ్వాలని నిర్ణయించారు. అలానే విద్యార్థుల్లో, పరిశోధకులలో లోతైన పరిశోధనా అవగాహన కోసం పోస్టర్ ప్రజెంటేషన్ చేయనున్నారు. ఇందులో అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థుల భాగస్వామ్యం కావాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ ఎస్. రఘునాథరెడ్డి, కుల సచివులు ఆచార్య పి.పద్మ, డీన్ ఆచార్య ఎజె దాము, ఆచార్య కె.గంగయ్య, అన్ని శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

నత్తనడకన వాటర్ గ్రిడ్ పనులు

- మూడున్నరేళ్లుగా గడపకు చేరని శుద్ధిజలం
- డిఐ పైప్‌లైన్ ఏర్పాటులో మీనమేషాలు
- 35 శాతం పనులు పెండింగ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పులివెందుల వాటర్‌గ్రిడ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2021 మే నుంచి 2024 మే నాటికి 62 శాతం పనుల్ని పూర్తి చేయగా, 2024 జనవరి నుంచి 2025 జనవరి నాటికి కేవలం ఆరు శాతం పనులకు పరిమితం కావడం పనుల పురోగతి ఇట్టే అర్థమవుతోంది. 2021 మేలో కడప జిల్లా పులివెందుల, కర్నూలు జిల్లా డోన్, శ్రీకాకుళం జిల్లా ఉద్దానం పట్టణాల్లో ఇంటింటికీ శుద్ధజలాన్ని అందించాలనే ఉద్దేశంతో వాటర్ గ్రిడ్ నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో అంతటితో కిడ్నీ వ్యాధులు ప్రబలిన నేపథ్యంలో వాటర్ గ్రిడ్ నిర్మాణాన్ని ఆగమేఘాల మీద పూర్తి చేసింది. కడప జిల్లా పులివెందుల వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టును 2021 మే 21న రూ.460 కోట్ల కాంట్రాక్టును మేఘా ఇంజినీరింగ్ సంస్థ దక్కించుకుంది. 2023 నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. నేటికీ అసంపూర్తి పనుల మధ్యే కొట్టుమిట్టాడుతోంది. పులివెందుల వాటర్‌గ్రిడ్‌కు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 1,175 కి.మీ పైప్‌లైన్ ద్వారా శుద్ధిజలాన్ని సరఫరా చేయాల్సి ఉంది. రోజుకు 0.83 టిఎంసిల నీటిని పులివెందుల, లింగాల, సింహాద్రిపురం, తొండూరు, చక్రాయపేట, వేంపల్లి, వేముల మండలాల పరిధిలోని 299 హ్యాబిటేషన్లకు చెందిన 2,20,631 మందికి అందించాల్సి ఉంది. కాంట్రాక్టు సంస్థ 24 నెలల వ్యవధిలో పనులు పూర్తి చేయాల్సి ఉంది. మూడున్నరేళ్ల వ్యవధిలో గడువు మీద గడువును పొడిగించుకుంటూ పనుల్ని పూర్తి చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. మూడున్నరేళ్లలో ఏదానికి సరిగా పులివెందుల వాటర్‌గ్రిడ్ 65 శాతం, డోన్ వాటర్‌గ్రిడ్ 70 శాతం పురోగతిని దాటని పరిస్థితి కనిపిస్తోంది. 2021 మే నుంచి 2023 మే నెలతో కాంట్రాక్టు గడువు ముగిసింది. అసంపూర్తి పనుల నేపథ్యంలో 2023 మే నుంచి 2024 మే వరకు, అనంతరం 2024 మే నుంచి 2025 నవంబర్ నాటికి కాంట్రాక్టు రెండు సార్లు గడువును ప్రభుత్వం పొడిగించింది. అయినప్పటికీ మరో 10 నెలల వ్యవధిలో పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఇంతటి స్వల్ప వ్యవధిలో 35 శాతం నుంచి 40 శాతం పనుల్ని పూర్తి చేయడంపై సందేహాలు నెలకొన్నాయి.

తాళ్లపల్లి దగ్గర కొనసాగుతున్న వాటర్‌గ్రిడ్ పనులు

డిఐ పైప్‌లైన్ ఏర్పాటులో కాంట్రాక్టు సంస్థ మీనమేషాలు లెక్కిస్తోంది. టెండర్ నిబంధనల మేరకు 288 కి.మీ మేరకు డిఐ పైప్‌లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. 90 కి.మీ పైప్‌లైన్ ఏర్పాటు చేసింది. మిగిలిన 80 కి.మీ ఏర్పాటులో మీనమేషాలు లెక్కిస్తోంది. మార్కెట్లో డిఐ పైప్‌లు రెట్టింపు ధర పలుకుతున్న నేపథ్యంలో జంకుతున్నట్లు సమాచారం. పులివెందుల వాటర్‌గ్రిడ్ పనుల్లో పైప్‌లైన్ ద్వారా గ్రామాలకు నీటిని అందించే జిఎల్ఎస్ఆర్‌లు, ఒహెచ్‌ఎస్ఆర్‌లు, జిఎల్ఎస్ఆర్‌ల నిర్మాణ ప్రక్రియ కీలకమైంది. 10 జిఎల్‌బిఆర్‌ల ప్రక్రియలో ఆరింటిని మాత్రమే పూర్తి చేసింది. 06 ఒహెచ్‌బిఆర్ ఎస్‌లలో ఐదింటిని పూర్తి చేసింది. 11 సంపుల్లో ఐదింటిని మాత్రమే పూర్తి చేసింది. 09 జిఎల్‌ఎస్ఆర్ ప్రక్రియలో రెండు మినహా మిగిలిన ప్రక్రియ గ్రౌండింగ్ దశలో ఉండడం గమనార్హం. నాలుగు రకాల ప్రక్రియ పనులు అసంపూర్తి నేపథ్యంలో మిగిలిన 80 కిలోమీటర్ల డిఐ పైప్‌లైన్, 307 కి.మీ మేర హెచ్‌డిపిఇ పైప్‌లైన్ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

ఏడాది వ్యవధిలో పూర్తి

2024 డిసెంబర్ నుంచి పైప్‌లైన్ పనులు ఊపందుకున్నాయి. 2026 మార్చి నాటికి పులివెందుల వాటర్‌గ్రిడ్ పనుల్ని పూర్తి చేస్తాం. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 60 శాతం హ్యాబిటేషన్లకు నీటిని అందిస్తాం. 2026 మార్చి నాటికి మిగిలిన గ్రామాలకు తాగునీటిని అందించే ప్రయత్నం చేస్తాం.

- కె.ఏడుకొండలు, ఎస్ఇ, ఆర్‌డబ్ల్యుఎస్, కడప.

ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

రిమ్స్‌లో ఆందోళన చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆప్కాస్ కార్మికులందరినీ ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, రద్దు విషయాన్ని ఉపసంహరించుకోవాలని ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిజిహెచ్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఆప్కాస్ వ్యవస్థను తీసివేసే గతంలో మాదిరిగానే తరుచు పార్టీ కాంట్రాక్టర్లకు ఇవ్వాలని ఈనెల 6న జరిగిన క్యాబినెట్ సమావేశంలో చర్చించినట్లు పత్రికల ద్వారా తెలిసిందన్నారు. ఇలా చేయడం వల్ల కార్మికులు మరింత వేదనలు మాలోపోతారని పేర్కొన్నారు. ఆప్కాస్ విధానం ఉండడంవల్ల కార్మికులకు నెలనెలా కచ్చితంగా వేతనాలు వస్తున్నాయని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలవుతుందని చెప్పారు. అదే థర్డ్ పార్టీ కాంట్రాక్టు ఇస్తే కార్మికులను భూమి మీద నుంచి నూతిలో వదిలేసినట్లవుతుందని తెలిపారు. ఇప్పుడు అవుట్ సోర్సింగ్ విధానంలో ఉన్న శానిటేషన్, సెక్యూరిటీ కావచ్చు వారికి జీవో ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. ఏ కార్మికుడైనా తమకు వేతనాలు ఇవ్వండి, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా కట్టండి అని అడిగితే వారి మీద కాంట్రాక్టర్లు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. దవ జిజిహెచ్‌లో శానిటేషన్, సెక్యూరిటీ సబ్ కాంట్రాక్ట్ నిర్వహిస్తున్న జె.బాల నారాయణరెడ్డి అనే కాంట్రాక్టర్ శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల జీవో ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని చెప్పారు. పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా కట్టడం లేదని పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వచ్చిన సందర్భంగా ఆర్జీ ఇచ్చిన కారణంగా ముగ్గురు కార్మికులను తొలగించారని తెలిపారు. మిగతా కార్మికులను ఎలాగైనా తొలగించాలనే ఉద్దేశంతో ఆయన కావాలనే కార్మికులను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రిమ్స్ ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కమిటీ కోశాధికారి బి.బాలాజీ రావు, ఉపాధ్యక్షులు భాస్కర్, రామకృష్ణ, ఏసన్న, సుదర్శన్, కార్యదర్శులు కొండయ్య, చెన్నయ్య, సురేష్, ల్యాబ్ కమిటీ సభ్యులు జయరాం, కన్నయ్య, జయసుధ, మరియమ్మ, గాంధీ నాయక్, శ్రీనివాసులు, సుబ్బారావు, పవన్, కార్మికులు జయ కాంత్, ప్రసాద్, బి.నాగేంద్ర, డి.వి.రమణ, సుబ్బరాయుడు, నరసయ్య, ఆప్కాస్ కార్మికులు పాల్గొన్నారు. నిరసనలో ఆప్కాస్ కార్మికులు

ఆప్కాస్ రద్దు వద్దు..

కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఆప్కాస్ రద్దు చేస్తామని కేబినెట్‌లో నిర్ణయం చేశారని రద్దు వద్దని, ఒక వేళ చేస్తే కార్మికులను రెగ్యులర్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జిల్లా కోశాధికారి గోపి అధ్యక్షతన ఆప్కాస్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కాస్ ఉద్యోగులు 1.20 లక్షల మంది పని చేస్తున్నారని పేర్కొన్నారు. వారికీ ప్రతి నెల 1 నుంచి 5 లోపల జీతాలు పడేవని చెప్పారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసిందని తెలిపారు. అందరిని రెగ్యులర్ చేసి రద్దు చేసుకోండి తమకు అభ్యంతరం లేదన్నారు. స్థానికంగా ఉన్న వారికి కాంట్రాక్టులు ఇస్తే వేతనాల్లో కోత విధించడం, పిఎఫ్ ఈఎస్ఐ కట్టకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తారని చెప్పారు. ప్రభుత్వం భవిష్యత్తులో నిర్వహించే కేబినెట్ సమావేశంలో రద్దును ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం వస్తే కార్మికుల జీతాలు పెంపు, పర్మినెంట్ చేస్తారని అనుకుంటే ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్ర రెడ్డి. జిల్లా సహాయ కార్యదర్శులు ఆనందరావు, బ్రహ్మానంద రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపాల్, నగర అధ్యక్షులు సుంకర రవి, ఉపాధ్యక్షులు ఇత్తడి. ప్రకాష్, డ్రైవర్స్ నాయకులు సుంకర కిరణ్, పర్మినెంట్ యూనియన్ నాయుకులు కొండయ్య, సోమిరెడ్డి, రాంమోహన్‌రెడ్డి, నారాయణ,శ్యాం, హరి, హనుమంతురెడ్డి, రామాంజనేయులు, అంజి, రాజా, గోపాల్, పాలకొండ రాయుడు, అరుణ్, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు

టెయిలింగ్ పాండ్ వ్యర్థాలను నివారిస్తాం

కర్నూల్, కడప పాల్యూషన్ బోర్డ్ నియంత్రణ అధికారులు

ప్రజాశక్తి - వేముల

వేముల మండలంలోని కెకె కొట్టాల గ్రామ సమీపంలోని టెయిలింగ్ పాండ్ నుంచి వెలువడే వ్యర్థాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని కర్నూల్ పొల్యూషన్ బోర్డ్ సీనియర్ పర్యావరణ ఇంజినీర్ శంకర్ నాయక్, కడప పొల్యూషన్ బోర్డ్ అధికారి అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం యురేనియం అధికారులతో కలిసి టెయిలింగ్ పాండ్ వ్యర్థాలను పరిశీలించారు. టెయిలింగ్ పాండ్ వ్యర్థాలపై ఎప్పటికప్పుడు తేమ ఉండేటట్టు, నీరు నిల్వ ఉండేటట్లు చూసుకోవాలని ఈ సందర్భంగా పరిశీలన బృందం యురేనియం అధికారులకు సూచించారు. అలాగే కొట్టాల గ్రామం వైపు కలుషితమైన గాలి వీచకుండా ఒక విండ్ గోడను నిర్మించాలని చెప్పారు. పొల్యూషన్ అధికారులు టెయిలింగ్ పాండ్ పరిశీలించేందుకు వచ్చారని సమాచారం తెలుసుకున్న కె.కె. కొట్టాల గ్రామస్తులు పెద్ద ఎత్తున గేటు వద్ద చేరుకొని వారిని కలిశారు. ఈ సందర్భంగా పొల్యూషన్ అధికారులతో గ్రామస్తులు మాట్లాడుతూ టెయిలింగ్ పాండ్ నిర్మాణమే పూర్తి పర్యావరణ నియమ నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. పర్యావరణ అనుమతులు, వాటి నియమాలను యురేనియం అధికారులు పాటించకుండా గాలిలో వదిలేశారని వాపోయారు. టెయిలింగ్ పాండ్ చుట్టూ చెట్లను పెంచడం, ఇతర ఆహ్లాదకర వాతావరణాన్ని చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇతర కార్యక్రమాలు చేయకుండా టెయిలింగ్ పాండ్ వ్యర్థాలపై తేమ ఉండాలని, నిబంధనను ఉల్లంఘించడంతో వ్యర్థాలు పూర్తిగా ఎండిపోయి ఆ కలుషితమై దుమ్ముధులి లేచి కొట్టాల గ్రామం వైపు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ చర్మ వ్యాధులతో శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నామని , ఇప్పుడు

కెకె కొట్టాల గ్రామస్తులతో మాట్లాడుతున్న పొల్యూషన్ నియంత్రణ అధికారులు

అధికారులు టెయిలింగ్ పాండ్ విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం వచ్చిందని తెలిపారు. ఉన్న టెయిలింగ్ పాండ్‌నే నియమ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని, పర్యావరణ అనుమతులు కూడా ఉల్లంఘి స్తున్నారని పొల్యూషన్ అధికారులకు పలు ఫొటోలను గ్రామస్తులు చూపించి వివరించారు. అనంతరం పొల్యూషన్ అధికారులు మాట్లడుతూ టెయిలింగ్ పాండ్ పరిశీలించామని వెంటనే అధికారులకు టెయిలింగ్ పాండ్ వ్యర్థాలపై ఎప్పుడూ నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించా మన్నారు. అలాగే గ్రామం వైపు ఒక విండ్ గోడను నిర్మించాలని సూచించినట్లు తెలిపారు. అందుకు యురేనియం అధికారులు కూడా చర్యలు చేపడతామని తెలిపినట్లు తెలిపారు. నియమాలను ఉల్లంఘించడం వంటి చర్యలను ప్రత్యక్షంగా చూశామని, వీటిపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వారం రోజులుగా టెయిలింగ్ పాండ్ నుంచి పెద్ద ఎత్తున కలుషి తమైన దుమ్ము దూళి వస్తుందని తాము ఆందోళన చేస్తున్నా పట్టించుకోలేదని, సోమవారం పొల్యూషన్ అధికారులు వచ్చిన వెంటనే పైపులు ద్వారా నీరు పట్టేందుకు వెంటనే పైపులు తీసుకొని టెయిలింగ్ పాండ్‌కు రావడం శోచనీయమని గ్రామస్తులు వాపోయారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - కడప

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జెసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి వారు అర్జీలను స్వీకరించారు. వేంపల్లి మండలం, టి. వెలమవారి పల్లి గ్రామానికి చెందిన పి. ఓబుల్ రాముడు తన కుమారుడు పెన్నా నదిలో కొట్టుకుపోయాయి మరణించారని తమకు ఆర్థిక సహాయం మంజూరు చేయాలని అభ్యర్తించారు. అదే మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన వెన్నపూస విగ్నేశ్వర్ రెడ్డి మల్లెపల్లి గ్రామానికి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని కోరారు. కాశినాయన మండలం సావిశెట్టిపల్లి గ్రామానికి చెందిన వీరపు సాంబ శివుడు తన భూమికి సంబంధించి కోర్టు ఆర్డరు ప్రకారం రిపోర్ట్ పంపేందుకు చర్యలు తీసుకోవాలని అభ్యర్తించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఎస్‌డిసిలు శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖాసింఖాన్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లా రచయితల సంఘం సమావేశానికి సహకరించిన ప్రముఖ సీనియర్ ఆడిటర్ లయన్ పఠాన్ ఖాసింఖాన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాంద్ బి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున సేవా కార్యక్రమాలలో కొనసాగిస్తున్నారు. భవిష్యత్తులో అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు మూల మల్లికార్జున రెడ్డి, కవులు, కళాకారులు, మేధావులు పాల్గొన్నారు.

ఖాసిం ఖాన్‌ను సన్మానిస్తున్న రచయితల సంఘం నాయకులు

రోజూ చెత్తను తొలగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలో చెత్తను ప్రతిరోజు తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి పారిశుధ్య విభాగ అధికారులను ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా నాగరాజు పేట, కాగితాల పెంట, సెవెన్ రోడ్ సర్కిల్, వీరాస్వామి మండి, పొట్టి శ్రీరాములు సర్కిల్, శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ ప్రాంతాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను శానిటేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. నాగరాజుపేట నారాయణ కళాశల వద్ద నుంచి కోటిరెడ్డి సర్కిల్, ఆర్‌ఆటిసి సర్కిల్ వరకు రోడ్డు ఇరువైపులా ఇంక్రోచ్మెంట్స్ తొలగించి చర్యలు తీసుకోవాల్సిందిగా టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

వైవీయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల బిఎ, బిఎస్‌సి, బికాం, బిబిఎ, బిసిఎ 1,3,5 సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావుతో కలసి విడుదల చేశారు. సోమవారం వైవీయూలోని తమ ఛాంబరులో ఫలితాలను విసి పరిశీలించారు. అనంతరం ఫలితాలను విశ్లేషిస్తూ నవంబరు లో పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఫస్ట్ ఇయర్ బిఎ, బిఎస్‌సి, బికాం, బిబిఎ, బిసిఎ కోర్సులలో 7,077 మంది పరీక్షలకు హాజరు కాగా 4, 484 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. మూడో సెమిస్టర్ డిగ్రీ పరీక్షలకు అన్ని గ్రూపులు కలుపుకుని 6,075 మంది పరీక్షలకు హాజరు కాగా 3,851 ఉత్తీర్ణులయ్యారన్నారు. డిగ్రీ ఐదో సెమిస్టర్‌కు సంబంధించి అన్ని గ్రూపులు కలుపుకుని 4,859 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3,782 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. విద్యార్థులు ఫలితాల కోసం https:www.yvuexams.in/results.aspx అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కృష్ణారావు సూచించారు. కార్యక్రమంలో సహ పరీక్షల అధికారులు డాక్టర్ మమత కుమారి, డాక్టరు కనుసు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటింటా న్యాయ ప్రచారం

ప్రజాశక్తి - కడప : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇంటింటా న్యాయ ప్రచారంలో భాగంగా 4586 గృహాలను టీం సభ్యులు సందర్శించారు. 80 మంది ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలను ఈ సందర్భంగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవ అధికార సంస్థ, ఆదేశానుసారంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డిఎల్‌ఎస్‌ఎ చైర్మన్ జి.శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పుట్టినప్పటి నుంచి 18 సంవత్సరాల లోపు గల పిల్లలకు పుట్టుకతో వచ్చే ఎదుగుదల లోపాలకు సంబంధించిన సమస్యల గుర్తించామన్నారు. నివారణ కోసం ఈనెల 10 నుంచి 24 వరకు ఇంటింటి న్యాయ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా 46 టీమ్‌లను ఏర్పాటు చేసి కార్యక్రమం నిర్వహించారు. 80 మంది ఎదుగుదల లోపాలు ఉన్న పిల్లలను గుర్తించారు. వారికి కడప, ప్రొద్దుటూరులోని జిల్లా సత్వర చికిత్స అందిస్తారు.

కల్లు గీత కులాలకు 14 మద్యం దుకాణాలు

ప్రజాశక్తి - కడప : జిల్లాలో గీత కులాలకు సంబంధించి 14 మద్యం షాపులకు లాటరీ పద్ధతిలో కేటాయించామని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గీత కులాలకు లాటరీ పద్ధతిలో 14 మద్యం షాపులు కేటాయించారు. తొలుత జెసి లాటరీ ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 2024-2026 ఏడాదికి గీత కులాలకు సంబంధించి మద్యం షాపులకు లాటరీ ద్వారా పారదర్శక కేటాయింపు ప్రక్రియను ప్రారంభించామని చెప్పారు. గతంలోనే జిల్లాలో గీత కులా కు సంబంధించి ఈడీగ, గౌడ్, గౌండ్ల, గౌడ నాలుగు కులాలకు మద్యం షాపుల కేటాయింపుకు లాటరీ పద్ధతి ద్వారా కులాలను ఎంపిక చేశామన్నారు. జిల్లాలో గీత కులాలకు సంబంధించి 14 మద్యం షాపులకు సంబంధించి 162 దరకాస్తులు రాగా వాటిని లాటరీ పద్ధతిలో ఎంపిక అయిన వ్యక్తులకు పకడ్బందీగా, పారదర్శకంగా మద్యం షాపులను కేటాయించామని చెప్పారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ ఆఫీసర్ వినోద్ కుమార్ నాయక్, సిఐ కృష్ణ కుమార్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదకరం : డిసిసి

ప్రజాశక్తి - కడప : అతివేగం ప్రమాదకరమని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు అతివేగంతో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కాకూడదని సూచించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా సోమవారం రాయల్ రషీద్ అసోసియేషన్ వారు ముద్రించిన ట్రాఫిక్ నిబంధన కరపత్రాలు ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత, విద్యార్థులు తమ మోటార్ బైక్‌ను విన్యాసాలకు ఉపయోగించుకోరాదని చెప్పారు.ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరిముల్లా, కాంగ్రెస్ పార్టీ నాయకులు పీస్ స్కూల్ కరెస్పాండెంట్ గౌస్ పీర్, మైనుద్దీన్, సంజయ్ కాంతమ్మ, శామ్యూల, హరిప్రసాద్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - వల్లూరు : మండలంలోని పైడికాలువలో వెలసిన అతి పురాతనమైన రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం ఆలయ వ్యవస్థాపకులు హరి నారాయణ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌కు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. గణపతి పూజ, గోపూజ వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం నక్షత్ర, నవగ్రహ, సుదర్శన హోమాలు, ఆయుష్న హోమం, రుష్యశృంగ, పుత్రకామేష్టి యాగము నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

వైసిపి కార్యాలయాన్ని తొలగించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : ప్రజలకు ఉపయోగం లేని అక్రమంగా మాసాపేటలో నిర్మించిన వైఎస్ఆర్ వాటర్ ప్లాంటు ముసుగులో వైసిపి కార్యాలయం నిర్వహిస్తున్నారని, వెంటనే తొలగించాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ డిమాండ్ చేశారు. సోమవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో 26వ డివిజన్‌లోని 164వ బూత్‌లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసి డివిజన్ ఇన్‌ఛార్జి చిగురుపాటి త్యాగరాజ్ ప్రజలకు ఉపయోగం లేని వాటర్ ప్లాంటు నిర్మించి అనధికారిక వైసిపి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. గతంలో ఇక్కడ పబ్లిక్ టాయిలెట్స్ ఉండేవని చెప్పారు. వెంటనే తొలగంచి ఉపయోగకరమైన పబ్లిక్ హెల్త్ క్లీనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కువైట్ ఎన్ఆర్ఐ.ఉపాధ్యక్షులు షేక్. రహమతుల్లా, రాఘవ, ప్రతాప్, విశ్వనాధ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - గోపవరం : ప్రభుత్వ స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ త్రిభువన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మడకలవారిపల్లి గ్రామ పొలం సర్వేనెంబర్ 24లో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందన్న సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ సోమవారం ఆక్రమణకు గురైన భూమిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మడకలవారిపల్లి గ్రామ పొలం సర్వేనెంబర్ 24ను ప్రభుత్వ పోరంబోకుగా చెరువులో ఉన్నందున సుమారు 70 సెంట్ల స్థలంలో అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ సిబ్బందితో కలిసి కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగించామన్నారు. ప్రభుత్వ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని తెలిపారు. అలా చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

అమెరికా దుశ్చర్యను వ్యతిరేకిస్తూ నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

భారతీయుల పట్ల అమెరికా దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, శివకుమార్ తెలిపారు. అమెరికా నుంచి వందలా దిమంది భారతీయులని బహిష్కరించి యుద్ధ విమానాల్లో తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం అంబేద్కర్ సర్కిల్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికాలో వలసదారులుగా ఉన్న భారతీయులను కాళ్ళు,చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీల్లాగా పంపించడం తగదన్నారు. యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను కూడా గౌరవంగా చూడాలని నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ప్రధాని మోదీ అనుసరించిన ఆర్థిక విధానాలు నిరుద్యోగాన్ని పెంచి పోషించడం వల్లే గత్యంతరం లేక భారతదేశ యువత వలస వెళ్తున్నారన్నారు. వికసిత్ భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏమాత్రం సరిపోదన్నారు. ప్రపంచ దేశాలలో భారతదేశం నిరుద్యోగంలో రోజురోజుకూపై స్థాయికి వెళుతుందే తప్ప నిరుద్యోగం రూపుమాపే పరిస్థితి మోడీ హయాంలో ఎక్కడా లేదన్నారు. కేవలం అంబానీ ఆదానిలకు ఊడిగం చేసే విధానాలు తెస్తూ కార్పొరేట్ శక్తులను మరింత ధనవంతులు చేసే విధానాలు తీసుకొస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్, ఉపాధ్యక్షులు అజయ్, నగర నాయకులు నిర్మల్, రాజేష్, రవీంద్ర పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతోనే మూఢనమ్మకాల నిర్మూలన

ప్రజాశక్తి - కడప అర్బన్ : శాస్త్రీయ దృక్పథంతోనే మూఢనమ్మకాల నిర్మూలన సాధ్యమవుతుందని కుమారస్వామిరెడ్డి అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు శాస్త్రీయ ఆలోచన పైన ఉపన్యాసాన్ని, మ్యాజిక్ వెనకనున్న అనేక సైన్స్ సూత్రాలను వివరించారు. కార్యక్రమానికి కళాశాల అధ్యాపకులు నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. శాస్త్రీయ ఆలోచన గ్రంథ రచయిత, కవి పిల్లా కుమారస్వామి రెడ్డి మాట్లాడుతూ సమాజంలో సైన్స్‌ను ఒక పాత్య గ్రంథంగా చూస్తున్నారని, సైన్సును నిత్యజీవితంలో భాగంగా చేసుకోవాలని, అప్పుడే సమాజంలో ఉన్న మూఢవిశ్వాసాలన్ని పటాపంచలవుతాయని చెప్పారు.జన విజ్ఞాన వేదిక నాయకులు బాల రంగయ్య అనేక సైన్స్ మ్యాజిక్ షో లను ప్రదర్శించారు. ఆ మ్యాజిక్ షోల వెనక ఉన్న సైన్సు సూత్రాలను విడమర్చి చెప్పారు. సమాజంలో అనేక మంది బాబాలు తరతరాల నుంచి ప్రజల్లో ఉన్న అనేక నమ్మకాలను ఆసరాగా చేసు కుని ప్రజలను మోసం చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారని పేర్కొన్నారు. మ్యాజిక్ వెనుక ఎలాంటి మాయలు, మంత్రాలు లేవని కేవలం సైన్సును ఉప యోగించే ఆ పనులు చేస్తున్నారని చెప్పారు. ఈ విష యాన్ని ప్రజలు అర్థం చేసుకునే కొద్దీ శాస్త్రీయ విజ్ఞానం నిత్యజీవితంలోకి వస్తుందని అన్నారు. జనవిజ్ఞాన వేదిక నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విజ్ఞానంతోనే విద్యార్థులు ఎదుగుతుందని వారి మానసిక వికాసానికి శాస్త్రీయ దృక్పథం తోడ్పడుతుందని అన్నారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు శివరాం మాట్లాడుతూ విద్యార్థులలో ఇలాంటి చైతన్యం పెరిగేం దుకు జనవిజ్ఞాన వేదిక నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందమం పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ విజేత 'యంగ్‌బాయ్స్'

ప్రజాశక్తి - కడప : ఖేలో ఇండియా గేమ్స్‌లో భాగంగా కడపలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహించిన అస్మిత ఫుట్‌బాల్ లీగ్ అండర్ -15 టోర్నమెంట్‌లో విజేతగా యంగ్ బాయ్స్ ఎఫ్ డబ్ల్యూఎ క్లబ్ నిలించింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. చివరి రోజు యంగ్ బాయ్స్ ఎఫ్ డబ్ల్యూ ఏ క్లబ్, యంగ్ మాన్ ఎఫ్ డబ్ల్యూ ఏ క్లబ్ జట్లు తలబడ్డాయి. విజేతగా యంగ్ బాయ్స్ ఎఫ్ డబ్ల్యూ ఏ క్లబ్ నిలిచింది. రన్నరప్‌గా యంగ్ మాన్ ఎఫ్ డబ్ల్యూ ఎ జట్టు నిలిచింది. విజేత జట్టుకు రూ.50 వేలు, రన్నర్స్ జట్టుకు రూ. 30వేల నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లు, ఫీల్డ్, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసి యేషన్ అధ్యక్షులు డానియల్ ప్రదీప్, స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి జగన్నాథ్‌రెడ్డి, క్రీడాకారులు, కోచ్‌లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన యంగ్ బాయ్స్ ఎఫ్ డబ్ల్యూ ఎ క్లబ్ బాలికల జట్టు

వైసిపిని తిరిగి అధికారంలోకి తెద్దాం

ప్రజాశక్తి - కడప : వైసిపిని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దామని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కార్యాలయంలో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. సూపర్ సెక్స్ పథకాలు ఎక్కడ అమలు కాలేదని అన్నారు. సమావేశంలో పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

చెక్కును పంపిణీ చేస్తున్న మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి

మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేద ప్రజలకు వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైన రూ.14,61,000 చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యలతో పలు ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నిరుపేద ప్రజలకు ఈ సహాయాన్ని అందించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం లబ్ధిదారులు సిఎం చంద్రబాబు, రవీంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో విఫలం

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన మధ్యాహ్న భోజన పథకం, గ్రామీణ సడక్ యోజనతోపాటు ఇతర పథకాలకు కేంద్రం నుండి నిధులు తెచ్చుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ పథకాలకు సంబంధించి కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జనవరి చివరి నాటికి ఈ పథకాల కింద కేంద్రం రూ.2,51,295 కోట్లు విడుదల చేయగా, మన రాష్ట్రానికి వచ్చింది కేవలం రూ.5,524 కోట్లు మాత్రమే అన్నారు. అదే సమయంలో తెలంగాణాకు రూ.12,282కోట్లు, కర్నాటకకు రూ.11,269 కోట్లు, అస్సాంకు రూ.14,762 కోట్లు, ఒడిశాకు రూ.10,272 కోట్లు రావడం గమనార్హం అన్నారు. సకాలంలో వినియోగ పత్రాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపకపోవడమే ఇందుకు కారణమన్నారు. ప్రభుత్వ అసమర్ధతకు ఇది నిదర్శనమన్నారు. ఇదేనా స్పీడ్ ఆఫ్ డూయింగ్ అంటే అని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా సకాలంలో వినియోగ పత్రాలు పంపి ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుంచి న్యాయంగా రావలసిన నిధులు తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా బిటెక్ రవి పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పుట్టిన రోజుల వేడులకు వేంపల్లెల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో టిడిపి నేత యాసిన్, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో కేక్ ఏర్పాటు చేశారు. టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బిజెపి నేత సుష్మా ఆధ్వర్యంలో స్థానిక నాగమ్మ నగర్‌లోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. బిటెక్ రవి సతీమణి లతారెడ్డి అన్నదానం చేసి, దుస్తులు, వృద్ధులకు, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల్లో కార్యకర్తలు ముందుకు రావడం సంతోషకరమని లతారెడ్డి చెప్పారు.

లింగాల : లింగాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బిటెక్ రవి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. మండల బాధ్యులు దేవిరెడ్డి సంజీవరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి అధ్వరంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చక్రాయపేట : పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు లోమడ భాస్కర్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గం బిసి నాయకులు క్రిష్ణగిరి రమేష్ ఆధ్వర్యంలో భారీ కేక్ పార్టీ శ్రేణులతో కట్ చేశారు. కడప పార్లమెంట్ అధికార ప్రతినిధి పట్టెం అశోక్, వెంకట్రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, మునిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీరంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

భారత దేశంలో మధ్యరంగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన పులివెందుల శ్రీరంగ నాథ స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు ఏర్పాటు చేసినట్లు శ్రీరంగనాథ స్వామి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఆలయ ఇఒ కెవి రమణ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ప్రతి రోజూ పలు పూజలు, ఇతర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 16న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథ స్వామి కల్యాణం, 17న బ్రహ్మరథోత్సవ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. 18న అశ్వవాహన సేవ, 19న హంస వాహన సేవలు ఉంటాయన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రాత్రి పూలంగళ్ల సర్కిల్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్ర మాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని కోరగుంటపల్లెకు చెందిన చింతపండు పెద్దన్న(50) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. పెద్దన్న తొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్లర్కుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల కాలంలో కుటుంబంలో కలహాలు తలెత్తడంతో మానసి కంగా ఇబ్బంది పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తమ ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లింగేశ్వరి, కుమారులు హరినాథ్, చంద్ర ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పెద్దన్న (ఫైల్‌ఫొటో)

అదృశ్యం కేసు నమోదు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామంలోని శ్రీరాంనగర్‌కు చెందిన తమ్మిశెట్టి సంజీవ్ అనే వ్యక్తి కనపడకపోవడంతో అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. తమ్మిశెట్టి సంజయ్ జనవరి 28న దుస్తులు ఇస్త్రీ చేసుకొని వస్తానని భార్య అయ్యవారమ్మకు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఆ తర్వాత ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు అందరూ బంధువులు ఇళ్ల వద్ద వెతికినా, ఆచూకీ లేదు. ఆ మేరకు సంజయ్ భార్య అయ్యవారమ్మ ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పాల వెల్లువ కేంద్రాల ప్రారంభమెన్నడో..!

ప్రారంభానికి నోచుకోని వెలిదండ్ల పాల సేకరణ భవనం

ప్రజాశక్తి - లింగాల

వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన పాలను నిల్వచేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయాలనే లక్ష్యం నీరుగారుతోంది. రూ.లక్షల నిధులతో నిర్మించిన పాలను నిల్వ చేసే కేంద్రాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో అవి నేడు నిరుపయోగంగా మారాయి. పాలను నిల్వ చేసే కేంద్రంలో ఏర్పాటు చేసిన అధునిక యంత్రాలు క్రమంగా తుప్పు పట్టే దశకు చేరుకుంటున్నాయి. నూతనంగా నిర్మించిన పాల కేంద్రాలు ప్రారంభనికి నోచుకోక పోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అరకొర వసతులు ఉన్న పాల కేంద్రంలో సేకరించిన పాలను నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. పాడి పరిశ్రమను అభివృద్ధి చేసి పాల ఉత్పత్తిని పెంపొందించాలని అముల్ సంస్థ ఆధ్వర్యంలో పాడి రైతుల నుంచి సేకరించిన పాలను నిల్వ చేసి అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లెలోని పాల కేంద్రానికి సరఫరా చేసేందుకు లింగాల మండలంలోని వెలిదండ్లలో రూ.25 లక్షలతో.. పార్నపల్లెలో రూ.15 లక్షలతో.. పెద్దకూడాలలో రూ.15 లక్షలతో జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకర సంఘం కేంద్రాలను గత ప్రభుత్వం నిర్మించింది. మండల పరిధిలోని 21 గ్రామాల నుంచి సమీపంలోని తిమ్మంపల్లి, తాడిమర్రి, యల్లనూరు ప్రాంతాల నుంచి కూడా పాలను సేకరించి ఆయా కేంద్రాలలో నిల్వ చేయాల్సి ఉంది. ఆ కేంద్రాల తలుపులు తెరవకపోవడంతో పాల నిల్వ జరగలేదు. ప్రజాధనం బుడిదలో పోసిన పన్నీరైందనే విమర్శలున్నాయి. నెలలు గడుస్తున్నా ఆ కేంద్రాల ప్రారంభోత్సవానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తోంది. ఫలితంగా తిమ్మంపల్లి, తాడిమర్రి, యల్లనూరు ప్రాంతాల నుంచి పాల సేకరణ జరగడం లేదు.

శిథిలావస్థలో ఉన్న పాల కేంద్రంలోనే నిల్వ..

రూ.55 లక్షలతో నిర్మించిన పాల కేంద్రాలు ప్రారంభానికి నోచుకోనందున.. మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న పాల సేకరణ భవనంలో పాల నిల్వ కార్యక్రమం కొనసాగుతోంది. పెచ్చులూడిన భవనంలో పాలను నిల్వ చేసే క్రమంలో ఇక్కడ పని చేసే సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్ల కింద ఏర్పాటు చేసిన కూలింగ్ యూనిట్ యంత్రం, కంప్రెసర్ యూనిట్లు రెండు, పాలను పరీక్షించే యంత్రం పదే పదే మరమ్మతులకు గురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఆ పాల కేంద్రాలను ప్రారంభించి చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

పదేపదే మరమ్మతులకు గురవుతున్న కూలింగ్ యూనిట్ యంత్రం

పరిసరాల శుభ్రత తప్పక పాటించాలి

విద్యార్థికి మాత్రలు వేస్తున్న జిల్లా మలేరియా అధికారి పి.మనోరమ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలో జరుగుతున్న నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి పి.మనోరమ పర్యవేక్షించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, హ్యాండ్ వాష్ ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సంపత్‌కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి టి.నరసింహారెడ్డి, డిఎంఒ ఆఫీస్ ఆరోగ్య విస్తరణాధికారి శివరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ డి.వెంకటసుబ్బయ్య, ల్యాబ్ టెక్నీషియన్ రమణ, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లె : నులి పురుగులు నివారించేందుకు విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రాలను పంపిణీ చేశారు. తాళ్లపల్లి ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వేంపల్లెలోని ఆయా ప్రభుత్వ, ప్రయివేటు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రాలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుగుణమ్మ, స్టాఫ్ నర్సు అరుణ, ఎఎన్ఎంలు నాగస్వర్ణ, ఆశాలు పాల్గొన్నారు.

చాపాడు : మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. కస్తూర్బా పాఠశాలలో ఎంపిడిఒ వీరకిషోర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నులిపురుగు నివారణ మందును ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. నక్కలదిన్నె పిహెచ్‌సి పరిధిలో డాక్టర్ ఓబులేసు, కావ్య మాధురి విద్యార్థులకు నులి పురుగులు నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్ ప్రసాద్, ఎఎన్ఎంలు శాంతకుమారి, సుజాత, ఎంఎల్‌హెచ్‌పి కీర్తి, ఆశా కార్యకర్త పోతులూరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాల : మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఐటిఐ కళాశాలల్లో నులిపురుగు నివారణ మందులను మండల వైద్యాధికారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ శివరాం, పిహెచ్ఎన్ కుసుమకుమారి, ఎఎన్ఎం అదిలక్షుమ్మ పాల్గొన్నారు.

సింహాద్రిపురం : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దాం.. అని ఎంపిడిఒ కృష్ణమూర్తి, సింహాద్రిపురం పిహెచ్‌సి వైద్యాధికారి షేక్ హుస్సేన్ పీరా పిలుపునిచ్చారు. శ్రీవివేకానంద పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రకాష్, పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వల్లి, డైరెక్టర్ జాఫర్ పాల్గొన్నారు.

గోపవరం : బద్వేల్ మండలం పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు, ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం డిప్యూటీ జిల్లా వైద్య అధికారి డాక్టర్ వి. మల్లేష్ సందర్శించి నులిపురుగు నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులకు సుబ్బారెడ్డి, సురేంద్ర నగర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు,డాక్టర్ జె.వినయ్ కుమార్,హెల్త్ ఎడ్యుకేటర్ బి. వెంగయ్య, ఎఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వల్లూరు : పిల్లలకు అల్బెండజోల్ 400 మిల్లీగ్రాములు మాత్ర అందించడం ద్వారా నులిపురుగుల సంక్రమణకు సులభంగా నిర్మూలించవచ్చని జిల్లా లెప్రసీ అధికారి రవిబాబు అన్నారు. మండల కేంద్రంలోని అన్ని పాఠశాలలో నులిపురుగుల మందును పంపిణీ చేశారు విద్యార్థులకు అవగాహన కల్పించి నులిపురుగుల నివారణకు మందుల అందించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి పనింద్ర, సిహెచ్‌ఒ వేణుగోపాల్, ఎఎన్ఎంలు, ఆశావర్కరు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : చిన్న పిల్లలకి అల్బండజోల్ మాత్రలు వేయడం వల్ల నులిపురుగుల రావని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉపఅధికారి శివప్రసాద్ తెలిపారు. ఎస్ఎస్‌వి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అమృతగార్డెన్స్‌లో నులిపురుగుల గురించి అవగాహన కల్పిం చారు. అల్బండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి భరత్ నారాయణ, ఆరోగ్య బోధకుడు వెంకలేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు శివప్రసాద్, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిపో మేనేజర్ శ్రీనివాసులు

రోడ్డు భద్రత చాలా ముఖ్యం : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎపిఎస్ఆర్‌టిసి డిపో మేనేజర్ శ్రీరాములు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత మీద ఆధారపడి ఉందన్నారు. యువత భద్రత చాలా కీలకమన్నారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు యువత మీద పెట్టుకున్న ఆశలు నెరవేర్చాలన్నారు. తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలంటే రోడ్డు భద్రత చాలా ముఖ్యమన్నారు. డిపో మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. తమ కళాశాల వద్ద బస్సులు నిలపకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. స్పీడ్ బ్రేకర్, రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేస్తామని డిఎం తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, ఆర్ఆర్‌సి కో-ఆర్డినేటర్ అయ్యవారు రెడ్డి, అనురాధ, లక్ష్మి, డాక్టర్ నవనీశ్వర్‌రెడ్డి, డాక్టర్ నరసింహారావు, సుబ్బరాయుడు, చిన్న రాయుడు, శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పులివెందుల టౌన్ : రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్ఐ నారాయణ సూచించారు. పట్టణ పరిధిలో సోమవారం సాయంత్రం రింగ్ రోడ్డు సర్కిల్ వద్ద ఆయన వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని వాహనాలకు, హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపే వారికి జరిమానా విధించారు.

ఆర్‌టిడి కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శ్రీదీప బ్లడ్ సెంటర్ రాయచోటి సహకా రంతో కళాశాల ప్రాం గణంలో రక్తదాన శిబిరాన్ని కర స్పాండెంట్ ఎల్. తరునేంద్ర శేఖర్, ప్రిన్సిపల్ టి.చంద్ర శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లా డుతూ రక్తదానం చేయడం వల్ల మనిషి తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. కరస్పాండెంట్ తరునేంద్ర శేఖర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం గొప్ప వరమన్నారు. యువత సేవాభావం కలిగి ఉండాలన్నారు. రక్తదానం చేసిన 55 మంది కళాశాల విద్యార్థులను ప్రశంసిస్తూ వారికి సర్టిఫికెట్లను మంజూరు చేశారు. కార్యక్రమంలో శ్రీదీప బ్లడ్ సెంటర్ రాయచోటి చైర్మన్ శివశంకర్‌రెడ్డి డాక్టర్ సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాయల్ ఎన్ఫీల్డ్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జింక అశోక్‌బాబు తెలిపారు. విద్యార్థులకు పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారని పేర్కొన్నారు. మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ బ్రాంచీల నుండి మొత్తం 178 మంది విద్యార్థులను ఎంపిక చేశారని తెలిపారు. ప్రిన్సిపల్, ప్లేస్మెంట్ ఆఫీసర్స్, అధ్యాపకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విజయ్‌కి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న అధికారులు

నమస్కార ప్రదర్శనలో 3వ స్థానం

ప్రజాశక్తి - వేంపల్లె

శత సహస్ర సూర్య నమస్కార ప్రదర్శనలో ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి విద్యార్థికి మూడవ స్థానం వచ్చినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. తెలంగాణలోని సిద్ధిపేటలో నిర్వహించిన శత సహస్ర సూర్య నమస్కార ప్రదర్శనలో ఆయా ప్రాంతాల నుండి 1,484 మంది యోగా విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి విద్యార్థి విజయ్‌కు అరుదైన గౌరవం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా సన్మానించి బహుమతులను అందజేసినట్లు తెలిపారు. క్యాంపస్‌లో సోమవారం డైరెక్టర్, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, యోగా ఇన్‌స్ట్రక్టర్లు అభినందించారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సిపిఎం నాయకులు జి.ఏసుదాసు డి మాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో సోమ వారం సిపిఎం ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జి. ఏసుదాసు మాట్లాడుతూ రాష్ట్రంలోని అతి పెద్దదైన ఎపిజిబిలో మిగిలిన గ్రామీణ బ్యాంకులు విలీనం అవుతున్న నేపథ్యంలో ఇక్కడి ప్రధాన కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగించాలన్నారు. అమరావతికి తరలించాలనే ప్రయత్నం విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జె.మధు, బి.రామాం జనేయులు, మునిశేఖర్, శంకర్, గంగాధర్, మునయ్య, కృష్ణమూర్తి, రాయలసీమ అభివృద్ధి వేదిక జమ్మలమడుగు నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి రాతపూర్వకంగా వివరిస్తున్న ఎంపీలు

సమస్యలను పరిష్కరించాలి

- కేంద్ర మంత్రులకు ఎంపీల వినతిపత్రాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి ఢిల్లీలో సోమవారం కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను, కేంద్ర అణుశక్తి సహాయ మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్‌ను కలిశారు. ఈ సందర్భంగా చెన్నై-అహ్మదాబాద్ మధ్య నడిచే వారపు రైలు (రైలు నంబర్-22919/22920) రైల్వే ప్రయాణికుల ప్రయోజనార్థం చెన్నై నుండి అహ్మదాబాద్‌కు వెళ్లే రైళ్లను కడప రైల్వేస్టేషన్‌లో తప్పకుండా ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం తిరుపతి నుండి షిరిడి నగరాలకు వారానికి ఒక్కసారి రైల్ సౌకర్యం ఉందని, అలాకాకుండా ప్రతిరోజు తిరుపతి నుండి షిరిడీకి రైల్‌ను ఎర్పాటు చేయాలన్నారు. యుసిఐఎల్‌లో నెలకొన్న సమస్యలపై కేంద్ర అణుశక్తి సహాయ మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్‌కు రాతపూర్వకంగా వివరించారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని ఎంపీలు కోరారు.

డీలర్లపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి - ఖాజీపేట

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

ప్రజా పంపిణీ వ్యవస్థలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసు కుంటున్నాయని, చౌక దుకాణదారులు అక్రమాలకు పాల్పడుతూ కార్డుదారులను మోసగిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రమిచ్చారు. వైసిపి జిల్లా జనరల్ సెక్రెటరీ రాఘవరెడ్డి, మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గం రైతు విభాగ అధ్యక్షులు జి.నాగిరెడ్డి రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రతి చౌక దుకాణదారుడు ఒక్కో కార్డుపై రెండు కిలోల వంతున తక్కువ తూకంతో బియ్యం ఇస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారించి కార్డుదారులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ విషయమై తాము ఉన్నతాధికారులను కూడా కలవనున్నట్లు చెప్పారు.

చిత్రలేఖనంలో 'బీరం' విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి గురు రాఘవ కార్తీక్ సీనియర్ విభాగంలో పాల్గొని బంగారు పతకం గెలుపొందారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారకరామారావు జయంతి పురస్కరించుకొని నంద్యాలలో గోవిందరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వారు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బీరం పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బంగారు పతకం సాధించిన విద్యార్థి గురు రాఘవ కార్తీక్‌ను కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా హస్తకళ ఉపాధ్యాయుడు పవన్ కల్యాణ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో బీరం పాఠశాలల విద్యాసంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేతా, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్ పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న బీరం సుబ్బారెడ్డి

'గండి' ఇఒపై గవర్నర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో పుణ్యక్షేత్రమైన గండి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ఇఒ జె.వెంకటసుబ్బయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గండి దేవస్థానం చైర్మన్ కృష్ణతేజ గవర్నర్ నజీర్ అహ్మద్‌కు డిజిటల్ ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఇఒపై శాఖపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గండి క్షేత్రంలో మహా కుంభాభిషేకం తక్షణమే జరిపించేలా దేవాదాయ శాఖ అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు.

దేవాలయ నిర్మాణానికి భూపేష్‌రెడ్డి భూమిపూజ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండలంలోని గూడెంచెరువు రాజీవ్‌నగర్ కాలనీలో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి సోమవారం టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. స్థానిక నాయకులను అడిగి గ్రామ సమస్యలపై ఆరా తీశారు. ఇటీవల వేసిన రోడ్లపై గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, జమ్మలమడుగు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, గ్రామ నాయకులు బాలు, శివారెడ్డి, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ యార్డులో ఎపి మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని భూపేష్ సుబ్బరామిరెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు. మైలవరం మండలం దుగ్గనపల్లె గ్రామంలో మూలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భూపేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - వేముల

స్థానిక పెద్దజుటూరు, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో 33కెవి మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, ప్రజలు గమనించి, సహకరించాలని జెఇ శ్రీనివాసులు కోరారు.

వెండి ఆభరణాలు వితరణ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక కన్యకా పరమేశ్వరి ఆల యంలోని శ్రీవాసవి మాతాకు 400 గ్రాములు వెండి ఆభరణాలను దాతలు వితరణ చేసినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. వేంపల్లె గ్రామానికి చెందిన మేడా వీరభద్రయ్య ధర్మపత్ని సిద్దేశ్వరి జ్ఞాపకార్థం వారి కుమారుడు మేడా చంద్రశేఖర్ రూ.40 వేలు విలువ చేసే వెండి ఆభరణాలు సమర్పించారని తెలిపారు. వాసవి మాతాకు వెండి ఆభరణాలు వితరణ చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. న్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కల్యాణ మండపం, అవోపా, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పేరు మార్పు

షేక్ సోడా బండి దస్తగిరి అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. షేక్ దస్తగిరి సోడా బండి ఇంటి నెంబర్ 3-2-24 లో దూదేకుల వీధి బద్వేల్ పట్టణంలోని వైఎస్ఆర్ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటి వరకు షేక్ సోడా బండి దస్తగిరిగా వాడుకలో ఉన్న నా పేరును ఆధార్ కార్డు లో ఉన్న విధంగా షేక్ దస్తగిరి సోడా బండిగా మార్చుకున్నాను. ఇకనుండి నా పేరు షేక్ దస్తగిరి సోడా బండి గా గమనించగలరు.